అల్లూరి సీతారామరాజు

వంట చేస్తుండగా కార్మికునికి గాయాలు

ప్రజాశక్తి -అరకు రూరల్: మండల కేంద్రంలోని ఏకలవ్య పాఠశాలలో మంగళవారం వంట చేస్తుండగా సాంబారు మీద పడడంతో తాంగుల ఒనాది అనే కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు, ఎపి గురుకులాల హాస్టల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పి కొండలరావు ఆర్.డుంబ్రిగూడ గ్రామంలోని బాధితుని ఇంటికి వచ్చి పరామర్శించారు. ప్రభుత్వపరంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

పరామర్శిస్తున్న సిఐటియు నేతలు

చీకటి జిఒ1ని తక్షణమే రద్దు చేయాలి

సిఐటియు ఆధ్వర్యాన నిరసనలు, జిఒ ప్రతుల దగ్ధం

రోడ్‌షోలు, సభలు, సమావేశాలపై ఆంక్షలు విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఒ1ని రద్దు చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన మన్యంవ్యాప్తంగా నిరసనలు చేపట్టారు. జిఒ ప్రతులను దహనం చేశారు. ప్రభుత్వం వెనక్కు తగ్గి, నిరంకుశ చీకటి జిఒ ఉపసంహరించుకునే వరకు ఆందోళన తప్పదని హెచ్చరించారు.

ప్రజాశక్తి -పాడేరు: సభలు సమావేశాలు రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జిఒ1ని రద్దు చేయాలని సిఐటియు అల్లూరు జిల్లా అధ్యక్షులు, బోనంగి చిన్నయ్యపడాల్ డిమాండ్ చేశారు. చింతపల్లి మండల కేంద్రంలోని మెయిన్ రోడ్ జిఒకాపీలను దగ్ధం చేశారు, ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతకు సమాధానం చెప్పలేని స్థితిలో లేనిపోని జిఒలను తెచ్చి ప్రజలకు ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు.సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి, వేములపూడి రామకష్ణ, సాగిన చిరంజీవి, రాజేశ్వరి జ్యోతి నూకరాజు పాల్గొన్నారు.

పాడేరు : రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చినటువంటి దుర్మార్గమైన జిఒ1ని రద్దు చేయాలని సిఐటియు సహాయ కార్యదర్శి ఎస్ నాగరాజు, జిల్లా కమిటీ సభ్యులు. సంజీవరావు కోరారు. గతంలో లాగానే సభలు సమావేశాలు, ర్యాలీలు, అనుమతి ఇవ్వాలని, కార్మికుల యొక్క హక్కుని కాలరాయ వద్దని, నిర్బంధమైన జిఒను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికులు సూర్య ప్రకాష్, ప్రభు, సుందర రావు, లక్కు,కలసి నాయుడు,దాసు,వైజాగ్ శ్రీను కార్మికులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ : రోడ్లపై బహిరంగ సభలు, ప్రదర్శనలను నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ 1 రద్దు చేయాలని కోరుతూ డుంబ్రిగుడలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌బి పోతురాజు ఆధ్వర్యంలో జిఒ ప్రతులను దగ్ధం చేసి నిరసన చేపట్టారు

హుకుంపేట: విపక్షాలు, పోరాటసంఘాల గొంతు నొక్కడమే లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం అమల్లోకి తెచ్చిన జిఒ1ని తక్షణమే రద్దు చేయాలని సిఐటియు మండల కార్యదర్శి టి.అప్పలకొండ పడాల్ డిమాండ్ చేశారు. మంగళవారం జిఒ ప్రతులను దగ్ధం చేసి నిరసన చేపట్టారు. ప్రభుత్వం తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు, ఎవరూ ప్రశ్నించి, నిలదీసే ఆస్కారం లేకుండా అప్రజాస్వామికంగా ఈ జిఒను అమల్లోకి తెచ్చిందని మండిపడ్డారు. కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు కె. అప్పారావు, డి కృష్ణమూర్తి, వి. రాంబాబు, జి అనంద్, వి లక్ష్మణ్ పాల్గొన్నారు

ముంచంగిపుట్టు : చీకటి జిఒ 1తో రాష్ట్రంలోని విపక్షాలు, ప్రజలు, కార్మికులతో పాటు అన్ని వర్గాల ప్రజల గొంతు నొక్కే ప్రయత్నాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేస్తోందని సిఐటియు మండల కార్యదర్శి కె.శంకరరావు మండిపడ్డారు. రాజ్యాంగ విరుద్ధమైన జిఒ ఒకటి రద్దుకు అన్నివర్గాల ప్రజలు ఐక్యంగా పోరాటానికి సన్నద్ధమై తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో సిఐటియు మండల కమిటీ సభ్యుడు పి భీమన్న, పి సుబ్బారావు, పి పోతరాజు, జి ఈశ్వర్ పాల్గొన్నారు.

.అరకులోయ రూరల్:_రోడ్డు షోలు బహిరంగ సభ, నిరసలు, ఆందోళనలు నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త జిఒ 1ని తక్షణమే రద్దు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఉమామహేశ్వరరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి బాలదేవ్,మండల అధ్యక్షులు ఎస్ ప్రభుదాస్_డిమాండ్ చేశారు. వైసిపి ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత పెరుగుతున్న నేపథ్యంలో భయంతో ఆందోళనలు పోరాటాలు చేయరాదని ఈ దుర్మార్గపు జిఒను తెచ్చింద న్నారు సిఐటియు నాయకులు కొండలరావు, చిన్న, శేఖర్, రాజు పాల్గొన్నారు.

డుంబ్రిగుడలో జిఒ ప్రతులను దగ్ధం చేస్తున్న సిఐటియు నేతలు

చింతూరు : ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతులను అణదొక్కేందుకే జీవో నెంబర్ 1ను ప్రభుత్వం తీసుకొచ్చిందని సీఐటీయూ మండల కార్యదర్శి పోడియం లక్ష్మణ్, గిరిజన సంఘం జిల్లా నాయకులు సీసం సురేష్ మండిపడ్డారు. జిఒ 1కు వ్యతిరేకంగా మండల కేంద్రం లో ర్యాలీ నిర్వహించి, జీవో 1 కాపీలను దగ్ధం చేశారు. మాజీ జడ్పీటీసీలు కుంజా సీతారామయ్య, ముర్రం రంగమ్మ, వేక రాజకుమార్ (ఎంపిటీసీ), ఆశావర్కర్లు యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు రవ్వ వీరమ్మ, జిల్లా అధ్యక్షులు బీరబోయిన దారేశ్వరి, దిలీప్, పాల్గొన్నారు.

విఆర్.పురంలో జిఒ ప్రతులను దగ్ధం చేస్తున్న ఎంపిపి లక్ష్మి, సిపిఎం, సిఐటియు నేతలు

కూనవరం : రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 1ను రద్దు చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో టేకులబోరు సెంటర్లో ధర్నా, రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు మేకల నాగేశ్వరావు మాట్లాడుతూ రాజ్యాంగం ప్రజలకు కల్పించిన హక్కులు కోల్పోయే విధంగా ఉందని ఈ జిఒ ఉందన్నారు. ముంపు ప్రజలకు అండగా ఉండి, ఈ జిఒకు వ్యతిరేకంగా స్థానిక ఎమ్మెల్యే, జడ్పీటీసీలు, ఎంపీపీలు పోరాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, నాయకులు తాళ్లూరి శ్రీనివాసరావు, సోదే శంకర్, నాగమణి, రత్తయ్య లక్ష్మన్ రాజు కర్నాటి నారాయణరావు, కొండా, ఈశ్వర్ బుచ్చిరెడ్డి మడకం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : ప్రజాస్వామ్యాన్ని కాలరాసే జీవో నెంబర్ 1ను రద్దు చేయాలని కోరుతూ జీవో ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు, సిఐటియు జిల్లా నాయకులు పి రామరాజు మాట్లాడుతూ బ్రిటిష్ ప్రభుత్వ కాలం నాటి చట్టాలను జగన్ ప్రభుత్వం నేడు అమలుకు పూనుకోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి.శ్రీను, జి శ్రీను, కె రాంబాబు, సీహెచ్ రాంబాబు, రాజేష్, అప్పన్న, ఎస్ వీరబాబు, బి బాబురావు, పలు కార్మికులు పాల్గొన్నారు.

విఆర్.పురం : మండల కేంద్రంలోని రేఖపల్లి జంక్షన్ వద్ద అంగన్వాడీలు, ఉద్యోగులు సిఐటియు ఆధ్వర్యంలో జీవో 1 కాపీలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పూనెం సత్యనారాయణ మాట్లాడుతూ రాజ్యాంగ హక్కుల కాలరాస్తే జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వానికి పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కారం లక్ష్మి, సర్పంచ్ పూనెం సరోజిని, రైతు సంఘం నాయకులు సోయం చిన్నబాబు, గూటాల శీను, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సున్నం రంగమ్మ, మండల అధ్యక్షులు రాజేశ్వరి, ప్రజా సంఘాల నాయకులు ఎస్ ప్రకాష్ రావు లక్ష్మణరావు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పాడేరులో దట్టంగా కురుస్తున్న మంచు

దట్టంగా పొగ మంచు

కొనసాగుతున్న చలి తీవ్రత

ప్రజాశక్తి-పాడేరు టౌన్

అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు ఏజెన్సీలో పొగ మంచు దట్టంగా కురుస్తోంది. దీంతో చలి తీవ్రత కొనసాగుతోంది. చలి ప్రభావంతో ప్రజలు వణికిపోతున్నారు. వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల వల్ల ఈ సీజన్ లో మునుపెన్నడూ లేనంతగా తక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ విభాగం అధికారులు తెలిపారు. దీంతో మన్యం ప్రాంతమంతా తీవ్రమైన చలి నెలకొంది. గత మూడు రోజుల నుంచి పాడేరు, చింతపల్లి ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదైంది. చింతపల్లి వ్యవసాయ పరిశోధన కేంద్రంలో ఆదివారం 1.5, సోమవారం 2, మంగళవారం 3 డిగ్రీలు నమోదు కాగా, పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీబోర్డులో ఆదివారం 6, సోమవారం 6, మంగళవారం 8 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏజెన్సీలోని అన్ని ప్రాంతాల్లోను ఉదయం 9గంటల వరకు మంచు తెరలు వీడకపోవడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. లైట్లు వెలిగించి వాహనాలు నడిపారు. పొగమంచుతో పాటు చలిగాలులు వ్యాపిస్తుండడంతో ప్రజలు, పర్యాటకులకు ఇబ్బందులు తప్పలేదు. పాడేరు పట్టణంలో పలుచోట్ల ప్రజలు చలిమంటలను ఆశ్రయించారు. పాడేరు ఘటిలో దట్టమైన పొగ మంచు అలుముకోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఎదురవుతోంది.

తహశీల్దారు, విఆర్‌ఒలతో సమావేశమైన సబ్ కలెక్టర్ శుభం బన్సల్

భూ రీ సర్వే త్వరితగతిన పూర్తి చేయాలి

ప్రజాశక్తి-మారేడుమిల్లి

భూముల రీ సర్వే ప్రక్రియ త్వరగతిన పూర్తి చేయాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ ఆదేశించారు. మంగళవారం ఆయన స్థానిక తహశీల్దారు కార్యాలయంలో తహశీల్దారు శ్రీనివాసరావు, వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని భూములకు సంబంధించి రీ సర్వే వేగవంతం చేసి చేయాలన్నారు. మూటేషన్ గుర్తించిన వెంటనే పూర్తి చేయాలని సూచించారు. పలు అంశాలపై అయన రెవిన్యూ సిబ్బందితో చర్చించారు. అనంతరం గ్రామంలో వివాదస్పద భూములను పరిశీలించారు.

వివాదాస్పద భూములకూ రిజిస్ట్రేషన్!

సబ్‌కలెక్టర్ కోర్టులో పెండింగ్‌లో ఉండగానే చేతులు మారిన వైనం

సమగ్ర విచారణకు సిపిఎం జెడ్‌పిటిసి గంగరాజు డిమాండ్

ప్రజాశక్తి. అనంతగిరి : సబ్‌కలెక్టర్ కోర్టులో ఉన్న వివాదాస్పద బూరుగ, చిన్నకోనల గ్రామాలకు సంబంధించిన భూములకు మరోమారు రిజిస్ట్రేషన్ చేయడం దుర్మార్గమని సిపిఎం జెడ్‌పిటిసి దీసరి. గంగరాజు మండిపడ్డారు మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ బూరుగ సర్వే నెంబర్ 1, 2లలో 38. ఎకరాల గిరిజనుల భూమిని ఇప్పటికే కొందరు గిరిజనేతరులు అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్న వ్యవహారంపై కోర్టులో కేసులు నడుస్తుండగా, తాజాగా మరల వేరే వ్యక్తి ఇటీవలే రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యవహారం తమ దృష్టికి వచ్చిందన్నారు.

90 ఎకరాల భూమి వివాదం సబ్‌కలెక్టర్ కోర్టులో పెండింగ్‌లో ఉండగానే ఎలా రిజిస్ట్రేషన్ చేయించారో అంతుపట్టడం లేదన్నారు. వివాదాస్పద భూములుగా చాలాకాలం నుంచి రెడ్ మార్క్‌లో ఉంచిన భూములు రిజిస్ట్రేషన్ వెనుక సంబంధిత రెవెన్యూ సిబ్బంది హస్తం తప్పకా ఉండిఉంటుందని విమర్శించారు. దీనిపై జిల్లా కలెక్టర్, సబ్‌కలెక్టర, ఐటిడిఎ పిఒ స్పందించి, సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వివాదాస్పద భూముల రిజిస్ట్రేషన్‌కు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. వీటి పరిరక్షణకు న్యాయపోరాటం చేస్తామన్నారు.

ఇదేం ఖర్మలో మాట్లాడుతున్న అబ్రహం

టిడిపితో గిరిజన ప్రాంత అభివృద్ధి

ప్రజాశక్తి -డుంబ్రిగూడ: టిడిపి అధికారంలో ఉంటేనే గిరిజన ప్రాంత అభివృద్ధి జరుగుతుందని ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ మాజీ సభ్యుడు సివేరి అబ్రహం అన్నారు. టిడిపి మండల అధ్యక్షుడు టి సుబ్బారావు ఆధ్వర్యంలో మంగళవారం అరమ పంచాయతీ నడిమివలసలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీలు, నిత్యవసరాల ధరలు పెంచుకుంటూ పోతున్న వైసిపి ప్రభుత్వానికి వచ్చే 2024 ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అరకు పార్లమెంట్ కోశాధికారి వి.నాగేశ్వరరావు, టిఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి ఎం.స్వామి, ఎస్‌టి సెల్ ఉపాధ్యక్షుడు కె. సుబ్బారావు, ఆనందరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వివాదరహితంగా సమగ్ర భూసర్వే

నిర్దేశిత గడువులోగా పూర్తికి అదనపు బృందాలు

ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ ఆదేశం

భూ సర్వే పురోగతిపై సమీక్షలో మాట్లాడుతున్న పిఒ,

ప్రజాశక్తి-పాడేరు టౌన్: సమగ్ర భూముల రీసర్వేను వివాద రహితంగా పూర్తి చేయాలని ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ ఆదేశించారు. మంగళవారం ఐటిడిఎ కార్యాలయం డా.బి.ఆర్. అంబేడ్కర్ సమావేశ మందిరంలో జి.మాడుగుల, చింతపల్లి, జికె వీధి మండలాల రెవెన్యూ అధికారులు, మండల, సచివాలయ సర్వేయర్లతో సమగ్ర భూసర్వే పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామసభలు నిర్వహించి. సమగ్ర భూ సర్వేపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. భూయజమాని సమక్షంలో సర్వే చేయాలన్నారు. భూముల సర్వేలో అభ్యంతరాలుంటే మొబైల్ ట్రిబ్యునల్ ద్వారా వివాదాలను అక్కడికక్కడే పరిష్కరిస్తామన్నారు.

చింతపల్లి మండలంలో 180 రెవెన్యూ గ్రామాలలో 52,063 ఎకరాలు, జి.మాడుగుల మండలంలో 217 రెవెన్యూ గ్రామాలలో 51,206.63 ఎకరాలు, జికె వీధి మండలంలో 135 రెవెన్యూ గ్రామాల్లో 63,484.31 ఎకరాలకు రీసర్వే చేయాల్సి ఉందన్నారు. డిసెంబరు 16వ తేదీ నుండి జనవరి 9వరకు జరిగిన సర్వే వివరాలను అడిగి తెలుసుకుని నమోదు చేసుకున్నారు. మూడు మండలాలల్లో అదనపు సర్వే బృందాలను నియమించి నిర్దేశించిన గడువులో సర్వే పూర్తి చేయాలని లక్ష్యాలను నిర్దేశించారు. సర్వే పూర్తి చేసిన డేటాను కలెక్టరేట్‌లో ఉన్న సర్వేసెంటర్‌కు చేరవేయాలని సూచించారు. వెక్టరైజేషన్, కొరలైజేషన్, ల్యాండ్ పార్సిల్ మ్యాప్ పనులు పక్కాగా నిర్వహించాలని చెప్పారు. జికె వీధి మండలంలో 8 గ్రామాలలో 2315.13 ఎకరాలు, చింతపల్లి మండలం 12 గ్రామాలలో 2156.73 ఎకరాలు, జి.మాడుగుల మండలం 11. గ్రామాలలో 873.64 ఎకరాలకు సర్వే పూర్తి చేసారన్నారు. ప్రభుత్వం సర్వేపై ప్రత్యేకంగా దష్టి పెడుతోందని చెప్పారు. జాప్యం లేకుండా సర్వే చేయాలన్నారు. సర్వే బృందాలు ఉదయం 8 గంటలకు గ్రామాలకు చేరుకుని సర్వే ప్రారంభించాలన్నారు. సమావేశంలో సర్వే సహాయ సంచాలకులు వై.మోహనరావు, జి.మాడుగుల, చింతపల్లి, జికె వీధి తాహాశీల్దారులు, ఆర్ ఐలు, విఆర్‌ఒలు, మండల సర్వేయర్లు, గ్రామ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

చింతగుప్పలో ప్రత్యేక వైద్య శిబిరం

కాలినడకన గ్రామానికి వెళ్లి వైద్య సేవలు అందించిన డాక్టర్ హిమబిందు

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం దారకొండ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం పరిధి చింతగుప్ప గ్రామంలో మంగళవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ప్రధానమంత్రి సురక్ష మంత్రిత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు పరీక్షలు నిర్వహించారు. దారకొండ పిహెచ్‌సి వైద్యాధికారిణి డాక్టర్ హిమబిందు, సిబ్బంది చూడరాయి వరకు వారి వాహనంలో వెళ్లి, అక్కడి నుంచి 3 కిలోమీటర్ల కాలినడకన చింతగుప్ప గ్రామానికి చేరుకున్నారు. అక్కడ 89 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ప్రతి ఇంటికి వైద్యాధికారి వెళ్లి గిరిజనుల ఆరోగ్య స్థితిగతులపై ఆరా తీశారు. ఈ క్రమంలో కొర్ర మల్లమ్మ అనే యువతి తీవ్రమైన జ్వరం, కాళ్ల వాపులతో వారం రోజులు నుంచి బాధపడుతూ నాటు మందులు వేసుకొని తీవ్ర అస్వస్థకు గురైన విషయాన్ని తెలుసుకున్నారు. దీంతో డాక్టర్ హిమబిందు ఆమెకు తనిఖీ నిర్వహించి వెంటనే మెరుగైన వైద్యం కోసం అంబులెన్సులు దారకొండ పిహెచ్‌సికి తరలించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యాధి సోకిన వెంటనే సమీపంలోనున్న తనకు గాని, హెల్త్ అసిస్టెంట్‌ని సంప్రదించి, ప్రభుత్వ వైద్యశాలలో వైద్య సేవలు పొందాలని కోరారు. పసర మందులు, నాటు మందులు వలన అనారోగ్యం నయం కాదని, దీనివల్ల వ్యాధి మరింత తీవ్రతరమై ప్రాణాలకు ముప్పు కలుగుతుందని, నాటు వైద్యానికి దూరంగా ఉండాలని సూచించారు. గర్భిణులు క్రమం తప్పకుండా ఆస్పత్రికి వచ్చి తనిఖీలు చేయించుకోవాలని, నెలలు నిండిన తర్వాత రెండు రోజులు ముందే ఆసుపత్రిలో చేరి కాన్పు చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్.రాణి, హెల్త్ సూపర్వైజర్ పోతురాజు, ఎంఎల్‌హెచ్ పి నాగమణి, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

నడిచి చింతగుప్ప గ్రామానికి వెళ్తున్న వైద్యాధికారి డాక్టర్ హిమబిందు, వైద్య సేవలు అందిస్తున్న దృశ్యం

సంక్రాంతి సెలవులకు బయలుదేరిన విద్యార్థులు

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరులోని పలు పాఠశాలల విద్యార్థులు సంక్రాంతి సెలవులకు మంగళవారం ఇళ్లకు బయలుదేరారు. ప్రభుత్వం ఈ నెల 12 నుండి 17 వరకు సంక్రాంతి సెలవులు ప్రకటించగా, మంగళవారంతో పరీక్షలు పూర్తికావడంతో ఒక రోజు ముందే విద్యార్థులకు ఇళ్లకు బయలుదేరారు. విద్యార్థులు సొంత గ్రామాలకు వెళ్లేందుకు ఎంతో ఉత్సాహంతో సీలేరు మార్కెట్ సెంటర్‌కు మంగళవారం చేరుకున్నారు. నర్సీపట్నం డిపోకు చెందిన పాసింజర్ బస్ సర్వీస్ సీలేరులో సాయంత్రం నాలుగు గంటలకు రావడంతో బస్సు ఎక్కేందుకు విద్యార్థులు పోటీ పడ్డారు. ఈ బస్సు తప్పిపోతే, తర్వాత ఏ బస్సు సౌకర్యాలు లేవు. రాత్రి 9, 11 గంటల వరకు నైట్ సర్వీసులు తప్ప ముందుగా ఎటువంటి బస్సు సౌకర్యం లేకపోవడంతో ఎలాగైనా వారి గ్రామం చేరుకోవాలని ఉద్దేశంతో విద్యార్థులు బస్సు ఎక్కేందుకు పోటీపడ్డారు. సుమారు వందమందికి పైనే విద్యార్థులు వారి తల్లిదండ్రులు బస్సు ఎక్కడంతో బస్సు కిక్కిరిసిపోయింది. పండుగ సమయాల్లో విద్యార్థులు సెలవులు దృష్టిలో పెట్టుకుని అదనంగా బస్సులు ఏర్పాటు చేసి ఉంటే ప్రయాణ సౌకర్యానికి ఇటువంటి సమస్యలు తలెత్తేవి కావని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోయారు.

బస్సు ఎక్కుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి విరాళాలివ్వండి

ప్రజాశక్తి-సీలేరు : జికె.వీధి మండలం సీలేరులో ఆంజనేయస్వామి పునర్నిర్మాణానికి విరివిగా దాతలు విరాళాలు అందజేయాలని ఆలయ కమిటీ అధ్యక్షులు ఎ.శ్రీనివాసరావు, కార్యదర్శి జి.శివప్రసాద్, సభ్యులు ఆర్ఎన్.రామకృష్ణ, వై.ధర్మరాజు, పి.శివప్రసాద్, రాజశేఖర్ కోరారు. సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సమీపంలో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయం 1962లో పిల్లాయి స్వామి ఆధ్వర్యంలో నిర్మాణం చేపట్టారు. అది శిథిలావస్థకు చేరుకుంది. దీంతో గ్రామ పెద్దలు, ఏపీ జెన్కో అధికారులు, కార్మిక సంఘ నాయకులు ఆలయ పునర్నిర్మాణం చేపట్టాలని తీర్మానం చేశారు. ఈ క్రమంలోనే విరాళాలు రూపేనా సుమారు రూ.35 లక్షలు సేకరించి 2022 ఫిబ్రవరిలో ఆలయ పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇంకా పూర్తిస్థాయిలో నిర్మాణం చేపట్టాలంటే రూ.25 లక్షల అవసరమవుతుందన, విరివిగా విరాళాలు అందజేయాలని ఆలయ కమటీ సభ్యులు కోరారు.

గురుకుల పాఠశాలను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి షేక్ సలీమ్ బాషా

గురుకుల పాఠశాలను సందర్శించిన ప్రత్యేకాధికారి

ప్రజాశక్తి-మారేడుమిల్లి

పీఎంసీ పాఠశాలగా గుర్తింపు పొందిన స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల ఆశ్రమ పాఠశాలను రాష్ట్ర విద్యాశాఖ సమగ్ర శిక్ష అభియాన్ ప్రత్యేక అధికారి, పీఎంసీ పాఠశాలల రాష్ట్ర పరిశీలకుడు డాక్టర్ షేక్ సలీమ్ బాషా మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో తనిఖీ చేశారు. తరగతి గదులు, వసతి గృహంలో సౌకర్యాలు పరిశీలించారు. పాఠశాల పరిసరాలు ఎప్పటి కప్పుడు శుభ్రంగా ఉంచాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్య పట్ల శ్రద్ధ చూపాలని సిబ్బందిని ఆదేశించారు. బాగా చదివి పదో తరగతి పరీక్షలో మంచి ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ షేక్ అలీషా, సీఆర్పీలు పి.రాజారెడ్డి, డి.కమలాకర్ బాబు, పాల్గొన్నారు.

పాయం రాములమ్మకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి-కూనవరం : ఉద్యోగం పేరుతో మోసపోయిన పాయం రాములమ్మకు న్యాయం చేయాలని కోరుతూ గిరిజన సంఘం, ఐద్వా నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలో గిరిజన సంఘం నాయకులు, సర్పంచ్ సోదే శంకర్, మహిళా సంఘ నాయకురాలు సర్పంచ్ మడకం నాగమణి, సుధారాణి, లక్ష్మాన్ రత్తయ్య, లక్ష్మయ్య తదితరులు మాట్లాడుతూ ఇటీవల కాలంలో బండారు గూడెం గ్రామానికి చెందిన పాయం రాములమ్మకు ఉద్యోగం ఇప్పిస్తానని ఆర్ఎంపి ముత్యాల శ్రీనివాసరావు డబ్బులు తీసుకొని ఇవ్వడం లేదని తెలిపారు. దీనిపై అధికార్లకు ఆమె విన్నవించారని తెలిపారు. ఈ ఆరోపణలపై రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం స్పందించి లోతుగా విచారించి నిజనిజాలు నిగ్గు తేల్చాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

విలేకర్ల సమావేశంలో పాల్గొన్న ఐద్వా, గిరిజన సంఘం నాయకులు

కార్మిక వ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటాలు

గిరిజన సంఘం ఆధ్వర్యాన ఆందోళన చేస్తున్న గిరిజనులు

దోమలజోరు తారురోడ్డు పూర్తయ్యేదెన్నడో..?

- గిరిజన సంఘం ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: మండలంలోని మాదల పంచాయితీ దాబుగుడ, దోమలజోరు రోడ్డు నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం గిరిజన సంఘం ఆధ్వర్యంలో గిరిజనులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం మండల కార్యదర్శి పి రామన్న మాట్లాడుతూ.దోమలజోరుకు రోడ్డు సౌకర్యం లేక రాకపోకలకు గిరిజనులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షంతో రోడ్డు కోతకు గురైతే, ప్రభుత్వపరంగా అధికారులు పట్టించుకోకపోవడంతో తామే స్వచ్ఛందంగా శ్రమదానం చేసి రోడ్డును బాగుచేసుకున్నామన్నారు. 2014 లో హుదూద్ తుఫాన్ సమయంలో దోమలజోరు, రక్తకండికు నాటి టిడిపి ప్రభుత్వం రోడ్డుతోపాటు, ఇళ్లను మంజూరు చేసిందన్నారు .అయితే రోడ్డు నిర్మాణం అర్థాంతరంగా ఆగిపోవడంతో భవన నిర్మాణ సామగ్రి తరలింపునకు వీలులేక ఇళ్లనిర్మాణాలు సైతం సగంలోనేనాగిపోయాయన్నారు. దోమలజోరు, రత్తకండి గ్రామస్తులు మోడల్ కాలనీ ప్రాంతంలో చిన్న రేకుషెడ్లు వేసుకుని నేటికీ నివాసానికి నానా అగచాట్లు పడుతున్నారన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు నాలుగేళ్లు కావస్తున్నా ఈ రోడ్డు దుస్థితిపై ఎటువంటి చర్యలు చేపట్టపోవడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం మన్యంలో మెజార్టీ ప్రజాప్రతినిధులు అధికార వైసిపికి చెందిన వారే ఉన్నప్పటికీ ప్రజాసమస్యల పరిష్కారంలోనూ, అసంపూర్తి దోమలజోరు వంటి రోడ్ల నిర్మాణం పూర్తి చేయడంలోనూ విఫలమయ్యారని మండిపడ్డారు. ఇప్పటికైనా దోమలజోరు తారురోడ్డు నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం పంచాయితీ నాయకులు కె.గోపాల్, పి అప్పన్న, పి చిన్న అప్పన్న, దాబుగుడ వార్డు సభ్యుడు ఎస్ సొన్ను, గ్రామస్తులు కొండబాబు, సీతారాం పాల్గొన్నారు.

సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర కార్యవర్గంలో హరి, సునీత

ప్రజాశక్తి -డుంబ్రిగూడ : ఇటీవల విజయవాడలో నిర్వహించిన సర్పంచ్‌ల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గంలో అల్లూరి జిల్లా నుంచి మండలంలోని కంద్రుం పంచాయతీ సర్పంచ్, స్థానిక మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు కె.హరి, సిపిఎంకు చెందిన గసభ పంచాయతీ సర్పంచ్ పి సునీత రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. రాష్ట్రకమిటీలో స్థానం దక్కించుకున్న హరి, సునీతల మండలంలోని సర్పంచులు అభినందించారు.

ఉచిత కుట్టు శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: గిరిజన మహిళలకు స్వయంఉపాధి లక్ష్యంగా ఉచితంగా కుట్టు శిక్షణనిస్తున్నట్లు ఐద్వా రాష్ట్ర నాయకులు వివి జయ అన్నారు. సోమవారం అరకువేలి గిరిజన సంఘం కార్యాలయంలో రోటరీ క్లబ్ విశాఖపట్నం సహకారంతో ఐద్వా అనుబంధ గిరిజన మహిళా సంఘం అద్యర్యంలో కుట్టు మిషన్ శిక్షణ తరగతులు ప్రారంభించారు. పరిసర ప్రాంతాలకు చెందిన 42 మంది గిరిజన మహిళలకు శిక్షణనివ్వనున్నారు. రెండు నెలలపాటు శిక్షణనిచ్చేందుకు ఇప్పటికే పది మిషన్లు తెచ్చారని, శిక్షణ అనంతరం సర్టిపికెట్ ఇస్తారన్నారు. టైలరింగ్ ట్రైనీ గొల్లారి భాగ్యవతి మాట్లాడుతూ, రోజూ వచ్చిన కుట్టుశిక్షణను పూర్తిగా నేర్చుకోవాలని సూచించారు.

జానకిరామ్ ఎన్నికపై హర్షం

ప్రజాశక్తి -అనంతగిరి : అల్లూరి జిల్లా ప్యాప్టో అల్లూరి జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రరిటీగా జానకిరామ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈనెల 9న అరకు నియోజకవర్గంలో ఫ్యాప్టో ఉపాధ్యాయ సంఘాల జిల్లా సమావేశంలో ఈ మేరకు ఎన్నిక జరిగింది.ఎపిటిఎఫ్ జిల్లా కార్యదర్శిగా ఉన్న జానకిరామ్‌ను ప్యాప్టో డిప్యూటీ జనరల్ సెక్రటరీగా ఎన్నిక కావడంపై ఎపిటిఎఫ్, యుటిఎఫ్ సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని జానకిరామ్ అన్నారు. ఉపాధ్యాయ, విద్యాసమస్యలపై పోరాటం చేస్తూ, పోరాట బలోపేతానికి కృషి చేయాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు శెట్టి రాంబాబు, డుంబారి. సన్యాసిరావు, పి .దేముడు, టి.బాలకృష్ణ గురుదొర, మల్లేష్ పాల్గొన్నారు.

హుకుంపేటలో జెండా ఆవిష్కరణ

సిఐటియు జిల్లా అధ్యక్షులు చిన్నయ్య పడాల్
జాతీయ మహాసభ నేపథ్యంలో పలుచోట్ల జెండావిష్కరణలు

ప్రజాశక్తి -పాడేరు: ఉద్యమాలు పోరాటాల ద్వారానే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టగలమని సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు, బోనంగి చిన్నయ్యపడాల్ అన్నారు, త్వరలో జరగనున్న సిఐటియు అఖిలభారత మహాసభలను పురస్కరించుకొని చింతపల్లి మండల కేంద్రంలోని మెయిన్ రోడ్ ఆవరణలో సిఐటియు జెండాను ఆవిష్కరించారు.

పాడేరు : అఖిల భారత సిఐటియు మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆటో స్టాండ్ వద్ద మంగళవారం సిఐటియు జెండాను ఆవిష్కరించారు. సిఐటియు సహాయ కార్యదర్శి ఎస్ నాగరాజు, జిల్లా కమిటీ సభ్యులు.సంజీవరావు మాట్లాడుతూ, కనీస వేతనాలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులకు పర్మినెంట్ చేయాలని,అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, తదితర సమస్యలపై చర్చించి భవిష్యత్ ప్రణాళికతో ఉద్యమాలకు సిఐటియు శ్రీకారం చుడుతుందన్నారు. ఆటో కార్మికులు సూర్య ప్రకాష్, ప్రభు, సుందర రావు, లక్కు,కలిసి నాయుడు,దాసు,వైజాగ్ శ్రీను కార్మికులు పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు: సిఐటియు అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం మండల కేంద్రంలో సిఐటియు అనుబంధ కార్మిక కర్షక నాయకుల సమక్షంలో యూనియన్ జెండాను యూనియన్ మండల కార్యదర్శి కె.శంకరరావు ఆవిష్కరించారు. సిఐటియు మహాసభల నేపథ్యంలో యూనియన్ జాతీయ కమిటీ పిలుపుమేరకు జెండా ఆవిష్కరణలు చేపట్టి, మహాసభలకు కార్మికలోకాన్ని సన్నద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. విఐఎల్ అంగన్వాడీలు, ఆశాలు మిడ్డేమీల్స్ కార్మికులు, వెలుగు విఓలు తదితర వివిధ విభాగాల కార్మికులకు కనీస వేతనాలు, సౌకర్యాలు కల్పించకుండా వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారన్నారు. పోరాడి సాధించుకున్న కార్మిక హక్కుల పరిరక్షణకు మహాసభల్లో చర్చించి పోరాట కార్యాచరణ రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల కమిటీ సభ్యుడు పి భీమన్న, పి సుబ్బారావు, పి పోతురాజు ,జి ఈశ్వర్ పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: ఈనెల 18 నుండి 22వ వరకు బెంగుళూరులో నిర్వహించనున్న అఖిలభారత సిఐటియు మహాసభలను జయప్రదంచేయాలని కోరుతూ మంగళవారం మండలకేంద్రంలో సిఐటియు జెండాను యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌బి పోతురాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పోతురాజు మాట్లాడుతూ అసంఘటిత కార్మికుల సంక్షేమ కోసం సిఐటియు నిరంతరం పోరాడుతూ, వారికి అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు టి సూర్యనారాయణ, ఎస్ గురుమిసింగ్, కార్మికులు పాల్గొన్నారు.

హుకుంపేట : ఆలిండియా సిఐటియు మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం మండల కేంద్రంలో సిఐటియు మండల కార్యదర్శి టి.అప్పలకొండ పడాల్ ఆధ్వర్యంలో యూనియన్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతంలో హైడ్రో పవర్ ప్రాజెక్టు అనుమతులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న అరాచక పాలనపై ప్రజలందరూ ఏకమై తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలు గాలికొదిలేసి సంక్షేమ పథకాల పేరుతో రాష్ట్రాన్ని సర్వనాసం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి గిరిజనుల నుంచి తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు.. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన విద్యార్థులు పిట్టల్లా రాలిపోతున్న ప్రజా ప్రతినిధులు ఎందుకు స్పందించడం లేదనిప్రశ్నించారు. విద్యార్థుల అకాల మరణాలను అరికట్టే చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సిఐటయు మండల నాయకులు కె. అప్పారావు, డి కృష్ణమూర్తి, వి. రాంబాబు, జి అనంద్, వి లక్ష్మణ్ పాల్గొన్నారు.

అరకులో...

అరకులోయ రూరల్: సిఐటియు అఖిల భారత 17వ మహాసభలు జయప్రదం చేయాలని అరకులోయ మండల కేంద్రంలో నాలుగు రోడ్డు జంక్షన్ వద్ద సిఐటియు జెండా ఆవిష్కరణ చేశారు..ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఉమామహేశ్వరరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి బాలదేవ్,మండల అధ్యక్షులు ఎస్ ప్రభుదాస్ మాట్లాడుతూ సిఐటియు అఖిల భారత మహాసభల్లో కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చిస్తామని బిజెపి ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా తెచ్చిన నాలుగు లేబర్ కోట్లు రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం 26,000 ఇవ్వాలని ,కార్మిక హక్కులు చట్టాలు పటిష్టంగా అమలు చేయాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలని కాపాడాలని మహాసభలో తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కొండలరావు, చిన్న,శేఖర్, రాజు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టులో...

రాజవొమ్మంగి : ఈ నెల 18 నుండి 22 వరకు బెంగుళూరులో జరిగే సిఐటియు 17వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ స్థానిక అల్లూరి సెంటర్ వద్ద సిఐటియు జెండాను ఆ సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు, సిఐటియు జిల్లా నాయకులు పి రామరాజు, పి.శ్రీను, జి శ్రీను, కె రాంబాబు, సీహెచ్ రాంబాబు, రాజేష్, అప్పన్న, ఎస్ వీరబాబు, బి బాబురావు, పాల్గొన్నారు.

తోటగరువు పాఠశాలను సందర్శించిన డిఇఒ

ప్రజాశక్తి - ఆరిలోవ : తోటగరువు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను డిఇఒ ఎల్.చంద్రకళ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఆమెతో పాటు ఆంధ్రప్రదేశ్ ఫుడ్ కమీషన్ సభ్యులు కాంతారావు ఉన్నారు. ఇరువురు కలిసి జగనన్న గోరు ముద్ద అమలు తీరును పరిశీలించారు. పోర్టిఫైడ్ బియ్యం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ పైడపు నాయుడు, అర్బన్ డిఇ సువర్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు దుర్గాభవాని పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి-సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామిని మంగళవారం సెంటర్ బ్యూరో అడిషనల్ డైరెక్టర్ చంద్రశేఖర్ ఆజా దంపతులు, సెంటర్ లేబర్ వెల్ఫేర్ బోర్డ్ మినిస్ట్రీ ఆఫ్ లేబర్ అండ్ ఎంప్లాయిమెంట్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా చైర్మన్ విజయ్ ప్రకాష్ నారాయణ దంపతులు వేర్వేరుగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. వీరు ముందుగా కప్పస్తంభాన్ని ఆలింగనము చేసుకున్నారు. బేడా మండపం చుట్టూ ప్రదక్షిణచేశారు. స్వామి అంతరాలయంలోనూ, గోదాదేవి సన్నిధిలోనూ ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించగా అధికారులు స్వామి వారి తీర్థప్రసాదాలు అందించారు.

ఆరిలోవ సిఐకి బదిలీ

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆరిలోవ సిఐ ఇమ్మాన్యుయేల్ రాజును సిటి విఆర్‌కు బదిలీ చేస్తూ నగర పోలీసు కమీషనర్ సిహెచ్. శ్రీకాంత్ ఆదేశాలు జారీ చేశారు. 2020 జూన్‌లో ఆయన ఆరిలోవలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన స్థానంలో మహరాణిపేట స్టేషన్‌లో సిఐగా పనిచేసిన జి.సోమశేఖర్ ఆరిలోవ పోలీస్టేషన్‌కు రానున్నారు.

గౌతమి పబ్లిక్ స్కూల్‌లో సంక్రాంతి వేడుకలు

ప్రజాశక్తి -పాడేరు టౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులోని తలారిసింగి గౌతమి పబ్లిక్ స్కూల్‌లో మంగళవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ముగ్గులు, సాంస్కతిక ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. పాఠశాల సిబ్బంది, విద్యార్థుల సంప్రదాయ వస్త్రాలంకరణ సంక్రాంతి శోభను ప్రతిబింబించాయి. భోగి మంటలు వేసి ఒకరికొకరు సంతోషాన్ని పంచుకున్నారు. పిల్లలకు తెలుగు సంప్రదాయాలు, పండుగ విశిష్టతలపై అవగాహన కల్పించేందుకే ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించినట్లు పాఠశాల ప్రిన్సిపల్ శివ, చైర్మన్ మాణిక్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గౌతమి పబ్లిక్ స్కూల్ లో భోగి మంట వేస్తున్న యాజమాన్యం

అల్లూరి జిల్లా డిసిఒగా రామకృష్ణంరాజు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

అనకాపల్లి జిల్లాలోని గ్రామీణ విద్యుత్ సహకార సంస్థ (ఆర్ఇసిఎస్) మేనేజింగ్ డైరక్టర్ రామకృష్ణంరాజును ప్రభుత్వం బదిలీచేసింది. అల్లూరి సీతారామరాజు జిల్లాకు జిల్లా సహకార శాఖాధికారి (డిసిఒ)గా ఆయన్ను నియమించింది. ఆర్ఇసిఎస్ ఎమ్‌డిగా పనిచేసిన కాలంలో ఆయన అనేక ఆరోపణలు ఎదుర్కొన్నారు. విద్యుత్ నియంత్రణ మండలి అనుమతిలేకుండా గత జులై, ఆగస్టు నెలల్లో రూ.17 కోట్ల విద్యుత్ బిల్లుల సొమ్మును వేరే ఖాతాలకు జమచేయడంపై ఎపిఇఆర్‌సి ఛైర్మన్ జస్టిస్ నాగార్జున రెడ్డి ఆయనపై సుమోటోగా కేసు నమోదు చేశారు. చేసిన తప్పును అంగీకరించి, తీసుకున్న జీతాన్ని తిరిగి సంస్థ ఖాతాకు జమ చేశారు. ఆర్ఇసిఎస్‌కు అనుబంధంగావున్న పాలిటెక్నిక్ కాలేజీ నిధులు దుర్వినియోగంపై కొందరు సహకార శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరుగుతున్నప్పుడు కూడా వివాదం తలెత్తింది. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని రామకృష్ణంరాజును అల్లూరి జిల్లాకు బదిలీ చేసినట్లు ప్రచారం జరుగుతోంది.

ఒకేచోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి - మాధవధార : 1981-82 పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక మాధవధారలో మధురానుభూతిని పంచింది. కైలాసపురం డిఎల్‌బి స్కూలులో పదో తరగతి చదువుకున్న నాటి విద్యార్థులు ఆర్.బాబూరావు, ఎం.ఆదినారాయణ, ఎంవైఎన్.కుమార్, ఒవిఎల్ఎస్ఎన్.కుమార్ తదితరులు పాల్గొని అప్పటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. మున్ముందు సేవా కార్యక్రమాలు చేపట్టాలని తీర్మానించారు.

దీక్షల్లో కూర్చున్న సిఐటియు నాయకులు

'ఉక్కు' కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవడానికి తాము ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నామని సిఐటియు పెందుర్తి జోన్ కార్యదర్శి జి.శంకరరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజా సంఘాల జెఎసి చేపట్టిన దీక్షలు మంగళవారం నాటికి 649వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకోవడం కోసం ఎంతటికైనా తెగిస్తామన్నారు. ఉక్కు త్యాగాలను కేంద్రంలోని బిజెపి పాలకులు గుర్తించాలన్నారు. దీక్షల్లో పాల్గొన్న వారిలో సంఘం పెందుర్తి జోన్ అధ్యక్షులు ఎస్.శంకరరావు, జి.ఆంజనేయులు, ఆర్.మాధవరావు, కె.మహాలక్ష్మి నాయుడు, పి.అప్పారావు, బి.పవిత్ర పాల్గొన్నారు.

నిత్యావసర అవస్థలు..!

రేషన్ జాబితాలో చోటులేని పప్పులు, బెల్లాలు, నూనెలు
బహిరంగ మార్కెట్‌లో భారీగా పెరుగుతున్న ధరలు
పౌరసరఫరాల శాఖ నిఘా వైఫల్యం



ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

పేదలు, సామాన్యులు అత్యధిక మంది ఆధారపడే ప్రజా పంపిణీ వ్యవస్థ (పిడిఎస్) అంతకంతకూ బలహీనపడిపోతోంది. ఫలితంగా కూలీలు, కార్మిక జనం బహిరంగ మార్కెట్‌లో తమకు కావాల్సిన నిత్యావసర వస్తువులను కొనుగోలు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కూలి డబ్బులన్నింటినీ నిత్యావసరాలకే వెచ్చించాల్సి వస్తోంది. వంట నూనెలు, కందిపప్పు, మినపపప్పు, చింతపండు, ఉప్పులు, టీ పౌడర్ల ధరలు భారీగా పెరిగిపోయాయి. వీటిని కొనలేక సాధారణ జనం అవస్థలకు గురౌతున్నారు. మార్కెట్‌లో వీటిని అదుపు చేసే నిఘా యంత్రాంగం నిద్రపోతోంది. విశాఖ నగరంలో ఇది బాహటంగా వెల్లడవుతోంది. కేవలం కల్తీ సరుకులపై అప్పుడప్పుడూ దాడులు చేయడం మినహాయిస్తే ధరల బాదుడు వినియోగదారులపై ఎలా ఉంటోందన్న క్షేత్రస్థాయి పరిశీలన ఉండడం లేదు. సంక్రాంతి పండగ సమీపిస్తుండడంతో వ్యాపారుల ఆగడాలకు అడ్డుకట్ట వేసే నాథుడే లేడన్న అభిప్రాయం సాధారణ జనం నుంచి వ్యక్తమవుతోంది. గతంతో పోల్చితే అన్ని రకాల ధరలూ నాలుగు రెట్లు పెరిగాయనడం అతిశయోక్తి కాదు.

అత్యధిక సంఖ్యలో పేదలే..

విశాఖలో ఇప్పటికే ఇంటి పన్ను, చెత్త పన్ను, మరుగుదొడ్ల పన్ను, రిజిస్ట్రేషన్ల బాదుడు అమలవుతోంది. త్వరలో ఖాళీ స్థలాలకూ పన్నులు వేయనున్నారు. విద్యుత్ ఛార్జీలు నిరంతరం పెరుగుతూ సామాన్య, మధ్య తరగతి ప్రజానీకాన్ని ఆర్థికంగా అవస్థలకు గురిచేస్తున్నాయి. విశాఖలో 5.20 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. వీటిలో సుమారు 2 లక్షల కుటుంబాలకుపైగా రేషన్ సరుకులపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ప్రస్తుతం రేషన్ ద్వారా బియ్యం మాత్రమే అత్యధికంగా పంపిణీ జరుగుతోంది. ఈ బియ్యం కూడా తినగలిగే పరిస్థితి లేదన్నది స్పష్టమవుతోంది. కందిపప్పు, పంచదారను పండగ నెలలో ఇస్తున్నామంటూ సివిల్ సప్లయిస్ అధికారులు చెబుతున్నప్పటికీ నగరంలో చాలా డిపోల్లో కేవలం బియ్యం మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని జనం వాపోతున్నారు..

ధరల బాదుడు ఇలా..

ధరల పెరుగుదల చూస్తే.. గతంలో రూ.90 ఉండే వంటనూనె ప్యాకెట్ ధర నేడు రూ.186కు ఎగబాకింది. కందిపప్పు కిలో రూ.70 నుంచి రూ.140 వరకూ పాకింది. మినపపప్పు రూ.65 నుంచి రూ.145కు, చింతపండు రూ.124 నుంచి రూ.350 వరకూ వెళ్లిపోయింది. సామాన్యులెవరైనా ఈ ధరలను మార్కెట్‌లో అందుకునే స్థితి ఉందా ? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. కూలి డబ్బులను నిత్యావసర సరుకులకే జనం వెచ్చిస్తున్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందించాల్సిన పై సరుకులన్నిటికీ గత ప్రభుత్వం ఎగనామం పెట్టగా, వైసిపి హయాంలో మరింత దిగజార్చారు. ఒక నెలకు ఒక కుటుంబానికి అవసరమైన సరుకులన్నీ రేషన్ డిపోల ద్వారా అందితేనే ప్రజా సంక్షేమం. ఆ బాధ్యత నుంచి ప్రభుత్వం తప్పుకోవడంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు.

ప్రత్యేక రైళ్ల సేవలు పొడిగింపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రయాణికుల అదనపు రద్దీని దృష్టిలో పెట్టుకుని రైల్వే శాఖ నాందేడ్ - బెర్హంపూర్, కటక్-సికింద్రాబాద్ మధ్య ప్రత్యేక రైళ్లను పొడిగించాలని నిర్ణయించింది. 07431 నాందేడ్-బెర్హంపూర్ ప్రత్యేక రైలు ఈ నెల 21, 28 తేదీలలో మధ్యాహ్నం 15.25 గంటలకు నాందేడ్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 09.25 గంటలకు దువ్వాడ చేరుకుని మరలా 09.27 గంటలకు బయలుదేరి 14.30 గంటలకు బెర్హంపూర్ చేరుకుంటుంది. 07432 బెర్హంపూర్ - నాందేడ్ స్పెషల్ బెర్హంపూర్ నుంచి జనవరి 22, 29 తేదీలలో సాయంత్రం 16.30 గంటలకు బయలుదేరి రాత్రి 21.35 గంటలకు దువ్వాడ చేరుకుని మరలా 21.37 గంటలకు బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 15.45 గంటలకు నాందేడ్ చేరుకుంటుంది.

07165 సికింద్రాబాద్-కటక్ ప్రత్యేక రైలు జనవరి 20, 27 తేదీల్లో రాత్రి 20.30 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 09.05 గంటలకు దువ్వాడ చేరుకుని మరలా 09.07 గంటలకు బయలుదేరి సాయంత్రం 17.45కు కటక్ చేరుకుంటుంది. 07166 కటక్-సికింద్రాబాద్ ప్రత్యేక రైలు జనవరి 21, 28 తేదీలలో రాత్రి 22.30 గంటలకు కటక్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 07.35 గంటలకు దువ్వాడ చేరుకుని మరలా 07.37కి బయలుదేరి రాత్రి 20.30 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది.

సైబర్ నేరగాళ్ల వలలో మహిళ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త పంథాతో ముందుకెళ్తూ పోలీసులకు సవాలు విసురుతున్నారు. తాజాగా నగరవాసిని పార్ట్ టైం జాబ్స్ పేరిట బుట్టలో వేసి రూ.5.40 లక్షలను కొట్టేశారు. కేసు వివరాలను సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె.భవానీ ప్రసాద్ మీడియాకు మంగళవారం వెల్లడించారు. విశాలాక్షినగర్‌కి చెందిన మహిళకు 7066147726 వాట్సాప్ నెంబర్ నుంచి బజాజ్ ఫిన్సర్వ్ రిసెప్షనిస్ట్ పేరిట 'పార్ట్ టైం జాబ్ చేసుకుని డబ్బు సంపాదించుకోండి' అని మెసేజ్ వచ్చింది. సదరు మహిళ ఆ మెసేజ్ చూసి మొదట వద్దని చెప్పింది. అవతల వ్యక్తి నమ్మించటం కోసం రూ.100ను అకౌంట్‌లో జమ చేయడంతో వార్త నిజం అనుకొని వారితో చాటింగ్ మొదటి పెట్టింది. సైబర్ నేరగాళ్లు వివిధ టాస్క్‌ల పేరుతో రూ.5.40 లక్షలను కొల్లగొట్టారు. బాధితురాలు మోసపోయిన విషయాన్ని గ్రహించి సైబర్ పోలీసులను ఆశ్రయించింది.

త్వరలో అందుబాటులోకి 'సీ-హారియర్స్'

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ పర్యాటక రంగంలో ప్రత్యేక సోయగంగా చెప్పుకునే సీ-హారియర్స్ యుద్ధ విమానం త్వరలో పర్యాటకులను కనువిందు చేయనుందని రాజ్యసభ సభ్యులు, వైసిపి జాతీయ ప్రధాన కార్యదర్శి వి.విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఐఎన్ఎస్ విక్రాంత్, ఐఎన్ఎస్ విరాట్ ఈ రెండూ ఎయిర్ క్రాఫ్ట్ కేరియర్స్ నుంచి ప్రయోగించే జెట్ ఫైటర్‌ను విఎంఆర్‌డిఎ నిర్మించిన మ్యూజియంలో త్వరలో ప్రదర్శనకు ఉంచనున్నారని పేర్కొన్నారు. ఈ విమానం గాలిలో ఎగురుతున్న అనుభూతిని కలిగించేందుకు మ్యూజియం సీలింగ్‌కు వేలాడేలా (ఫ్లోటింగ్) ఏర్పాటు చేస్తున్నారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ఈ ఏర్పాట్లు చేయబడ్డాయని విజయసాయిరెడ్డి వెల్లడించారు.

టాటా మోటార్స్ ఏస్ డెలివరీలు ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : భారతదేశ అతిపెద్ద వాణిజ్య వాహన తయారీ సంస్థ టాటా మోటార్స్ అత్యంత అధునాతన, చిన్నతరహా వాణిజ్య వాహనాల్లో సరికొత్త ఎఐ ఇవీ ఇంట్రా-సిటీ కార్గో ట్రాన్స్‌పోర్ట్ విభాగంలో గణనీయ ముందడుగు వేసింది. ఇ-కామర్స్, ఎఫ్ఎంసిజి, కొరియర్ కంపెనీలు, లాజిస్టిక్ సర్వీస్ ప్రొవైడర్లు అయిన అమెజాన్, డెలివరీ, డిహెచ్ఎల్, ఫెడ్ ఎక్స్, ఫ్లిప్‌కార్ట్, జాన్సన్ అండ్ జాన్సన్ కన్స్యూమర్ హెల్త్, మూవింగ్, సేఫెక్స్ ప్రెస్, ట్రెంట్ లిమిటెడ్‌లకు ఏస్ ఇవిల మొదటి ఫ్లీట్‌ను టాటా మోటార్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిరీశ్ వాఘ్ విశాఖ నగరంలో ప్రారంభించారు. టాటా మోటార్స్ కార్యాలయం వద్ద తలపెట్టిన ఈ కార్యక్రమంలో సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు, బాలింతలకు అందించే పౌష్టికాహారంలో ఎటువంటి లోటుపాట్లూ ఉండరాదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు బి.కాంతారావు అన్నారు. మంగళవారం ఉదయం ఆయన నగరంలోని పలు ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా చిన వాల్తేరులోగల కెడిపిఎమ్ హైస్కూల్‌ను సందర్శించారు. అక్కడ విద్యార్థులతో మాట్లాడి మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిఎస్ఒ సూర్యప్రకాష్‌రావు, డిఇఒ చంద్రకళ పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాల బలోపేతంపై దృష్టి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : దీర్ఘకాలిక వృద్ధి కోసం నాణ్యతా ప్రమాణాలు బలోపేతం చేయడంపై దృష్టి సారించామని ఎడెల్వీస్ టోకియో లైఫ్ ఇన్సూరెన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుబ్రజిత్ ముఖోపాధ్యాయ తెలిపారు. మంగళవారం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. లక్ష్యం దిశగా కస్టమర్, పంపిణీదారుల ప్రాసెస్ ఆప్టిమైజేషన్‌కు ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలిపారు. క్లెయిమ్ సెటిల్‌మెంట్ రేషియో, పెర్సిస్టెన్సీ రేషియో, గ్రీవెన్స్ రేషియో, నెట్ ప్రమోటర్ స్కోర్ పేరిట నాలుగు నాణ్యతా ప్రమాణాలు ప్రాథమికంగా ఉన్నాయన్నారు. ఇవి వ్యాపార పటిష్టతకు సూచికలని తెలిపారు.

ఎస్‌సి కార్పొరేషన్‌పై నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌సి కార్పొరేషన్‌ను పూర్తిగా విస్మరించిందని, మూడేళ్లుగా ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా ఒక్క పథకాన్నీ అమలు చేయలేదని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు జెవి.ప్రభాకర్ అన్నారు. దళితుల బతుకుదెరువు కోసం అమలు చేయాల్సిన ట్యాక్సీ, ఆటో కేటాయింపు స్కీంలను నిలిపివేసారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌సి కార్పొరేషన్‌పై నిర్లక్ష్యం తగదంటూ మంగళవారం ఎల్ఐసి కూడలిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌సి కార్పొరేషన్ నిధులను నవరత్నాలకు దారి మళ్లించడం ఆపాలన్నారు.

ఇఒ పోస్టులను భర్తీ చేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : దేవాలయాల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి చిన్న చూపు ఉందని, అందువల్లే ఖాళీగా ఉన్న ఇఒ పోస్టులను భర్తీ చేయడం లేదని టిడిపి విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి పాశర్ల ప్రసాద్ అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో దేవాదాయ శాఖ పరిధిలోని సుమారు 200 ఆలయాలకు కేవలం 29 మంది మాత్రమే ఇఒలు ఉన్నారని తెలిపారు. మిగిలిన ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.